పాక్ గడ్డపై భారత్ జయభేరి

డేవిస్ కప్‌లో 4-0తో దాయాదిపై విజయం

ఇస్లామాబాద్: ఆరు దశాబ్దాల తర్వాత పాకిస్థాన్ గడ్డపై అడుగుపెట్టిన భారత డేవిస్ కప్ జట్టు.. అద్వితీయ ప్రదర్శనతో వరల్డ్ గ్రూప్-1లో స్థానం దక్కించుకుంది. రెండు రోజుల పాటు సాగిన డేవిస్ కప్ 'టై'లో భారత్ 4-0తో దాయాది పాకిస్థాన్‌ను చిత్తుచేసింది. ఆదివారం జరిగిన రెండు మ్యాచ్‌ల్లోనూ మనవాళ్లు జయకేతనం ఎగరవేశారు. సాకేత్ మైనేని-యూకీ బాంబ్రీ జంట 6-2, 7-5 (7/5)తో ముజమ్మిల్-అఖీల్ ద్వయంపై గెలుపొందగా.. పురుషుల సింగిల్స్ మ్యాచ్‌లో నిక్కీ పునాచ 6-3, 6-4తో షోయబ్‌పై గెలుపొందాడు.

హైదరాబాద్ పాంచ్ పటాకా

హైదరాబాద్, ఆట ప్రతినిధి: దేశవాళీ ప్రతిష్ఠాత్మక టోర్నీ రంజీ ట్రోఫీలో హైదరాబాద్ వరుసగా ఐదో విజయం నమోదు చేసుకుంది. ప్లేట్ గ్రూప్‌లో భాగంగా మిజోరాంతో జరిగిన పోరులో హైదరాబాద్ ఇన్నింగ్స్ 73 పరుగుల తేడాతో గెలుపొందింది. మిజోరాం తొలి ఇన్నింగ్స్‌లో 199 పరుగులు చేయగా.. హైదరాబాద్ 465/9 వద్ద ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన మిజోరాం 193 పరుగులకు ఆలౌటైంది. మన బౌలర్లలో తనయ్ త్యాగరాజన్ ఐదు వికెట్లతో సత్తాచాటాడు. బంతితో 6 వికెట్లు పడగొట్టడంతో పాటు బ్యాట్‌తో 60 పరుగులు చేసిన ఆల్‌రౌండర్ రోహిత్ రాయుడుకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. దీంతో గ్రూప్ దశలో ఆడిన ఐదు మ్యాచ్‌ల్లోనూ నెగ్గిన హైదరాబాద్ 35 పాయింట్లతో పట్టిక టాప్‌లో నిలిచింది. ఈ ఐదు మ్యాచ్‌ల్లోనూ మనవాళ్లు ఇన్నింగ్స్ తేడాతో విజయాలు సాధించడం విశేషం.

ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన విహంగ మారథాన్‌లో పాల్గొన్న భారత స్టార్ షట్లర్ సాత్విక్ సాయిరాజ్, కోచ్ గురు సాయిదత్

ఇబ్రహీం శతకం

కొలంబో: ఓపెనింగ్ బ్యాటర్ ఇబ్రహీం జద్రాన్ (101 బ్యాటింగ్) సెంచరీ చేయడంతో శ్రీలంకతో జరుగుతున్న ఏకైక టెస్టులో అఫ్గానిస్థాన్ పోరాడుతున్నది. అంతకు ముందు లంక తొలి ఇన్నింగ్స్‌లో 439 పరుగులు చేయగా.. అఫ్గాన్ 198 రన్స్ కొట్టింది. రెండో ఇన్నింగ్స్‌లో అఫ్గాన్ బ్యాటర్లు పోరాట పటిమ చూపారు. ఇబ్రహీంతో పాటు నూర్ అలీ (47), రహ్మత్ షా (46 బ్యాటింగ్) రాణించారు. చేతిలో 9 వికెట్లు ఉన్న అఫ్గాన్.. ప్రత్యర్థి స్కోరుకు ఇంకా 42 పరుగులు వెనుకబడి ఉంది.

ఈ నెల 7 నుంచి రెజ్లింగ్ టోర్నీ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఈ నెల 7, 8 తేదీల్లో రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలంగాణ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ వెల్లడించింది. అండర్-15, అండర్-20 వయో విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు హఫీజ్, మహమ్మద్ కరీం తెలిపారు. హన్మకొండ వేదికగా జరగనున్న ఈ పోటీల్లో సత్తా చాటినవారు జాతీయ స్థాయికి ఎంపి కవుతారని వెల్లడించారు.

గిల్ (104)

శుభ్‌మన్ గిల్ సూపర్ సెంచరీ

రసపట్టులో..

ఇంగ్లండ్ లక్ష్యం 399; ప్రస్తుతం 67/1 భారత్ రెండో ఇన్నింగ్స్ 255

ఆధిక్యం చేతులు మారుతూ సాగుతున్న వైజాగ్ టెస్టు రసకందాయంలో పడింది. భారీ లక్ష్యాన్ని నిర్దేశించే అవకాశం ఉన్న టీమ్‌ఇండియా.. రెండో ఇన్నింగ్స్‌లో 255 పరుగులకు ఆలౌటైంది. చాన్నాళ్ల తర్వాత శుభ్‌మన గిల్ బ్యాట్ నుంచి చక్కటి సెంచరీ జాలువారగా.. మిగిలిన వాళ్లు పెద్దగా ఆకట్టుకోలేకపోయారు!

భారత గడ్డపై నాలుగో ఇన్నింగ్స్‌లో 399 పరుగుల లక్ష్యఛేదన అంటే దాదాపు అసాధ్యమే.. కానీ.. ఇంగ్లిష్ టీమ్ ఆటతీరు టీమ్‌ఇండియాను కలవరపెడుతున్నది. 'బజ్‌బాల్' పేరుతో గత రెండేండ్లుగా పిచ్, పరిస్థితులతో సంబంధం లేకుండా.. స్టోక్స్ సేన సాగిస్తున్న విధ్వంసాన్ని మన బౌలర్లు ఎలా నిలువరిస్తారనేది కీలకం. తొలి సెషన్‌లో ఇంగ్లండ్ బ్యాటర్లను అడ్డుకోగలిగితే సిరీస్ సమం చేసినట్లే!!

విశాఖపట్నం: తొలి టెస్టులో అనూహ్య పోరాటంతో విజయం సాధించిన ఇంగ్లండ్‌కు.. రెండో టెస్టులోనూ దాదాపు అలాంటి పరిస్థితే ఎదురైంది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా వైజాగ్ వేదికగా జరుగుతున్న రెండో టెస్టులో ఇంగ్లండ్ విజయానికి 399 పరుగులు అవసరం కాగా.. ఆదివారం మూడో రోజు ఆట ముగిసే సమయానికి ఆ జట్టు వికెట్ నష్టానికి 67 పరుగులు చేసింది. ఓపెనర్లు జాక్ క్రాలీ (29 బ్యాటింగ్), డకెట్ (28) ధనాధన్ ఆటతీరుతో తమ ఉద్దేశాన్ని చాటగా.. ప్రస్తుతం క్రాలీతో పాటు నైట్‌వాచ్‌మన్ రేహాన్ అహ్మద్ (9) క్రీజులో ఉన్నాడు. చేతిలో 9 వికెట్లు ఉన్న ఇంగ్లండ్ ఈ మ్యాచ్ నెగ్గాలంటే మరో 332 పరుగులు చేయాల్సి ఉంది. భారత్‌లోనే కాకుండా.. మొత్తం ఆసియా ఖండంలో జరిగిన టెస్టు మ్యాచ్‌ల్లో నాలుగో ఇన్నింగ్స్‌లో ఇంత భారీ లక్ష్యాన్ని ఛేదించిన దాఖలాలు లేకపోయినా.. ఇంగ్లండ్ విధ్వంసక ఆటతీరు భారత అభిమానులను ఆందోళన పరుస్తున్నది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 28/0తో ఆదివారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన రోహిత్ సేన చివరకు 255 పరుగులకు ఆలౌటైంది. వన్‌డౌన్‌లో పెద్దగా ఆకట్టుకోలేకపోతున్న శుభ్‌మన్ గిల్ (147 బంతుల్లో 104; 11 ఫోర్లు, 2 సిక్సర్లు) ఎట్టకేలకు బ్యాట్‌కు పనిచెప్తూ చక్కటి సెంచరీ నమోదు చేసుకోగా.. అక్షర్ పటేల్ (45) అతడికి అండగా నిలిచాడు. యశస్వి జైస్వాల్ (17), రోహిత్ (13), శ్రేయస్ అయ్యర్ (29), రజత్ పాటిదార్ (9), శ్రీకర్ భరత్ (6) విఫలమయ్యారు. ఇంగ్లండ్ బౌలర్లలో హార్ట్‌లీ 4, రేహాన్ మూడు వికెట్లు పడగొట్టారు.

సంక్షిప్త స్కోర్లు

భారత్ తొలి ఇన్నింగ్స్: 396;
ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 253;
భారత్ రెండో ఇన్నింగ్స్: 255 (గిల్ 104, అక్షర్ 45; హార్ట్‌లీ 4/77, రేహాన్ 3/88);
ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్: 67/1 (క్రాలీ 29 నాటౌట్, అశ్విన్ 1/8).

అతనొక్కడే!

బ్యాటింగ్‌కు సహకరిస్తున్న పిచ్‌పై భారత బ్యాటర్లు ఆకట్టుకోలేకపోయారు. వెటరన్ పేసర్ అండరసన్ నిప్పులు చెరిగే బంతులతో రోహిత్, జైస్వాల్‌ను వరస ఓవర్లలో పెవిలియన్‌కు పంపగా.. పట్టుదలతో బ్యాటింగ్ చేసిన గిల్ ఇంగ్లిష్ బౌలర్లకు ఎదురు నిలిచాడు. అనవసర షాట్ల జోలికి పోకుండా పూర్తి నియంత్రణలో బ్యాటింగ్ చేసిన శుభ్‌మన్.. ఇన్నింగ్స్‌ను గాడిన పెట్టగా.. స్టోక్స్ అద్భుత ఫీల్డింగ్‌తో శ్రేయస్ అయ్యర్ పెవిలియన్ చేరాడు. రజత్ పాటిదార్ విఫలమైనా.. అక్షర్‌తో కలిసి గిల్ స్కోరుబోర్డును నడిపించాడు. ఇక ప్రత్యర్థి ముందు భారీ లక్ష్యాన్ని నిర్దేశించడం ఖాయమే అనుకుంటున్న దశలో సెంచరీ అనంతరం గిల్ ఔట్ కాగా.. ఆ తర్వాత భారత ఇన్నింగ్స్ ముగిసేందుకు ఎక్కువ సమయం పట్టలేదు. చివర్లో అశ్విన్ (29) కొన్ని విలువైన పరుగులు చేసి లక్ష్యాన్ని 400కు చేరువ చేశాడు.

బజ్‌బాల్‌కు పరీక్ష

'భారత జట్టు 600 లక్ష్యాన్ని నిర్దేశించినా.. దాన్ని ఛేదించొచ్చని కోచ్ మెక్‌కలమ్ మాతో చెప్పాడు'.. మూడో రోజు ఆట అనంతరం ఇంగ్లిష్ పేసర్ అండర్సన్ అన్న మాట ఇది. ఈ ఒక్క వాఖ్యం చాలు ఇంగ్లండ్ జట్టు ఎలాంటి మానసిక స్థితితో ఈ మ్యాచ్‌కు సిద్ధమైందో చెప్పేందుకు! ఇటీవలి కాలంలో టెస్టు క్రికెట్‌ను కొత్త పుంతలు తొక్కిస్తూ.. దూకుడే పరమావధిగా దూసుకెళ్తున్న ఇంగ్లండ్.. భారీ లక్ష్యాలను ఛేదిస్తూ అందరినీ ఆశ్చర్య పరుస్తున్నది. బెన్ స్టోక్స్ సారథిగా.. మెక్‌కలమ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత.. ఆ జట్టు టెస్టుల్లోనూ టీ20 తరహా దూకుడు ప్రదర్శిస్తున్నది. భారత గడ్డపై 'బజ్‌బాల్' పప్పులు ఉడకవని.. స్పిన్నర్లు సత్తాచాటే చోట ఇంగ్లండ్ దూకుడు మంత్రం పనిచేయదని.. సిరీస్‌కు ముందు విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. అయితే అది కేవలం భ్రమే అని.. ఉప్పల్ టెస్టులో స్టోక్స్ సేన నిరూపించింది. ఆశలే లేని స్థితి నుంచి అద్వితీయ పోరాటంతో మ్యాచ్‌ను వశం చేసుకుంది. ఇప్పుడు వైజాగ్‌లో ఇంగ్లండ్ ముందు 399 పరుగుల లక్ష్యం నిలిచింది. సాధారణంగా మరే జట్టైనా ఇంత లక్ష్యాన్ని చూస్తే ముందే చేతులెత్తేసేది కానీ.. 'బజ్‌బాల్' ఆటతీరును ఆవాహన చేసుకున్న ఇంగ్లండ్ మాత్రం అదో సాధారణ టార్గెట్‌లా ధాటిగా ఇన్నింగ్స్ ఆరంభించింది. మరో రెండు రోజుల ఆట మిగిలిఉన్న ఈ మ్యాచ్‌లో ఫలితం తేలడం పక్కా కాగా.. అది ఎవరికి అనుకూలంగా వస్తుందో అనేది ఆసక్తికరం! నైట్‌వాచ్‌మన్‌గా పంపిన రేహాన్ అహ్మద్‌ను ఇంగ్లిష్ కామెంటేటర్లు పించ్‌హిట్టర్ అని సంబోధించారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. మరి దూకుడుకు అసలు పరీక్ష పెట్టనున్న ఈ మ్యాచ్‌లో భారత్ విజయం సాధిస్తుందా.. లేక ఇంగ్లండ్ జట్టుదు పైచేయి అవుతుందా అనేది నేడు తేలనుంది.

సాజిదకు కాంస్యం

హైదరాబాద్, ఆట ప్రతినిధి: కృష్ణా రివర్ స్విమ్మింగ్ పోటీల్లో తెలంగాణ స్విమ్మర్ షేక్ సాజిదా కాంస్య పతకం సాధించింది. విజయవాడ వేదికగా కృష్ణా నదిలో జరిగిన ఈ పోటీల్లో సాజిదా 1.25 కిలోమీటర్ల దూరాన్ని 32 నిమిషాల 52 సెకన్లలో ఈది మూడో స్థానంలో నిలిచింది.

అబాట్ (69; 3/40)

అబాట్ ఆల్‌రౌండ్ షో

సిడ్నీ: సీన్ అబాట్ (69; 3/40) ఆల్‌రౌండ్ ప్రదర్శనతో చెలరేగడంతో వెస్టిండీస్‌పై ఆస్ట్రేలియా వన్డే సిరీస్ కైవసం చేసుకుంది. ఇరు జట్ల మధ్య ఆదివారం జరిగిన రెండో వన్డేలో ఆస్ట్రేలియా 83 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఆసీస్ 50 ఓవర్లలో 9 వికెట్లకు 258 పరుగులు చేసింది. టాపార్డర్ విఫలంకాగా.. అబాట్ అర్ధశతకంతో మెరిశాడు. అనంతరం ఛేదనలో విండీస్ 43.3 ఓవర్లలో 175 పరుగులకు ఆలౌటైంది.

విలియమ్సన్ (112*)

కేన్, రచిన్ సెంచరీలు

మౌంట్‌మాంగనీ: కేన్ విలియమ్సన్ (112 బ్యాటింగ్; 15 ఫోర్లు), రచిన్ రవీంద్ర (118 నాటౌట్; 13 ఫోర్లు, ఒక సిక్సర్) సెంచరీలతో కదంతొక్కడంతో దక్షిణాఫ్రికాతో తొలి టెస్టులో న్యూజిలాండ్ మంచి స్కోరు దిశగా సాగుతున్నది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ తొలి రోజు ఆదివారం ఆట ముగిసే సమయానికి 258 పరుగులు చేసింది. ఈ మ్యాచ్ ద్వారా ఆరుగురు సఫారీ ప్లేయర్లు అంతర్జాతీయ టెస్టు అరంగేట్రం చేశారు.

చిత్రం

గోవాలో నాగ్ సినిమా

అగ్ర హీరోలు నాగార్జున, ధనుష్‌లతో దర్శకుడు శేఖర్ కమ్ముల భారీ మల్టీస్టారర్ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే. శ్రీవెంకటేశ్వర సినిమాస్, అమిగోస్ క్రియేషన్స్ సంస్థలు నిర్మిస్తున్న ఈ సినిమా కొద్ది రోజుల క్రితమే లాంఛనంగా ప్రారంభమైంది. ఈ సినిమాకు సంబంధించిన తాజా షెడ్యూల్ నేటి నుంచి గోవాలో ప్రారంభంకానున్నట్లు తెలిసింది. ఇందులో నాగార్జున, ధనుష్ పాల్గొంటారని..కొన్ని ముఖ్యఘట్టాలను తెరకెక్కిస్తారని చెబుతున్నారు. తనదైన శైలి సెన్సిబుల్ ఎమోషన్స్‌తో పాటు అంతర్లీనంగా చక్కటి సందేశాన్ని కలబోసి దర్శకుడు శేఖర్ కమ్ముల ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారని చెబుతున్నారు. ఈ చిత్రంలో రష్మిక మందన్న కథానాయికగా నటిస్తుండగా, దేవిశ్రీప్రసాద్ సంగీతాన్నందిస్తున్నారు.

అలా చేయడం కరెక్ట్ కాదు

సినిమా సెట్స్ నుంచి లీకైన ఫొటోలను షేర్ చేయడం మంచి పద్ధతి కాదని, అలా చేయడం వల్ల సినిమాపై ఆసక్తి తగ్గిపోతుందని చెప్పింది అగ్ర కథానాయిక రష్మిక మందన్న. ప్రస్తుతం ఈ భామ 'పుష్ప-2'లో అల్లు అర్జున్ సరసన నటిస్తున్న విషయం తెలిసిందే. ఇటీవలే ఈ సినిమా షూటింగ్ నుంచి హీరో అల్లు అర్జున్‌కు సంబంధించిన స్టిల్ ఒకటి బయటికొచ్చింది. ఈ విషయంపై రష్మిక అసంతృప్తిని వ్యక్తం చేసింది. ఆమె మాట్లాడుతూ 'సినిమా కోసం కొన్ని వందల మంది కష్టపడి పనిచేస్తారు. లీకైన ఫొటోలను సోషల్‌మీడియాలో షేర్ చేయడం ఏమాత్రం భావ్యం కాదు. 'పుష్ప-2'పై దేశవ్యాప్తంగా భారీ అంచనాలున్నాయి. ప్రేక్షకులకు గొప్ప థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ అందించడానికి టీమ్ అంతా కృషి చేస్తున్నది' అని చెప్పింది. 'పుష్ప' చిత్రంలో రష్మిక మందన్న పోషించిన శ్రీవల్లి పాత్రకు మంచి గుర్తింపు లభించింది. ఆమెను పాన్ ఇండియా తారగా నిలిపింది. ఈ నేపథ్యంలో 'పుష్ప-2'లో రష్మిక పాత్ర ఎలా ఉండబోతుందన్నది ఆసక్తికరంగా మారింది. ఆగస్ట్ 15న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది.

'రామాయణ'లో కొత్త సాంకేతికత!

నితేశ్ తివారీ దర్శకత్వం వహిస్తున్న 'రామాయణ'లో రాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయిపల్లవి, రావణుడి పాత్రలో యష్ కనిపించనున్నారు. ఈ ఇతిహాసం 2025 ద్వితీయార్థంలో విడుదల కానున్నది. ఈ చిత్రాన్ని ఈ నెలలో లేదా మార్చిలో కచ్చితంగా పట్టాలెక్కించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. రామాయణం మొత్తం ప్రపంచాన్ని నితేశ్ తివారీ ఇప్పటికే నిర్మించినట్లు తెలుస్తున్నది. ఈ సినిమాతో ఫిల్మ్ మేకింగ్‌కు సంబంధించి కొత్త సాంకేతికతను పరిచయం చేయాలని మేకర్స్ భావిస్తున్నారు. దీనికి సంబంధించిన టెస్ట్ షూట్ రన్‌ను ఇప్పటికే అనేక సార్లు నిర్వహించినట్లు సన్నిహిత వర్గాలు తెలిపాయి. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో ఈ సినిమా తెరకెక్కించబోతున్నారు. ఈ సినిమాలో రావణుడి పాత్ర కోసం మేకర్స్ సంప్రదించినప్పుడు యష్ వెంటనే ఒప్పుకోలేదు. అభిమానులు తనను రావణ పాత్రలో చూడగలుగుతారా..? అన్న సందిగ్ధంలోనే కొన్నిరోజులు ఉండిపోయారు. వారి నుంచి స్పష్టమైన అభిప్రాయం వ్యక్తమైన తర్వాతే ఈ క్యారెక్టర్‌ను ఓకే చేశారు. యష్ ప్రస్తుతం తన తదుపరి చిత్రం 'టాక్సిక్' ప్రధాన భాగంలో నిమగ్నమయ్యారు. ఇది పూర్తిచేసిన తర్వాత జూలై నెలలో 'రామాయణ' బృందంలో చేరనున్నారు.

మారుతి, శ్రీగౌరిప్రియ, మణికందన్, ఎస్‌కేఎన్

హృదయాన్ని కదిలించే కథ

మణికందన్, శ్రీగౌరిప్రియ నటించిన తమిళ చిత్రం 'ట్రూ లవర్'. ప్రభురామ్ వ్యాస్ దర్శకుడు. ఈ సినిమాను దర్శకుడు మారుతి, నిర్మాత ఎస్‌కేఎన్ తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. ఈ నెల 10న విడుదలకానుంది. ఆదివారం ట్రైలర్‌ను విడుదల చేశారు. మారుతి మాట్లాడుతూ 'ఓ జంట తమ ప్రేమను కాపాడుకునేందుకు ఎలాంటి సంఘర్షణను అనుభవించారనే అంశాన్ని ఈ సినిమాలో హృద్యంగా చూపించారు. దర్శకుడు అనుభవంలోంచి వచ్చిన కథ ఇది. దాదాపు ఆరేళ్లు కష్టపడి ఈ స్క్రిప్ట్ రాసుకున్నానని డైరెక్టర్ నాతో చెప్పాడు. ఇలాంటి చక్కటి ప్రేమకథను తెలుగు ప్రేక్షకులు మిస్ చేసుకోవద్దని కోరుతున్నా' అన్నారు. 'ఈ సినిమాలో కొన్ని సన్నివేశాలను చూస్తున్నప్పుడు మేము తీసిన 'బేబి' సినిమా గుర్తుకొచ్చింది. రెండు రోజుల ముందుగానే ప్రీమియర్స్ వేస్తున్నాం. ప్రేమలో ఉన్నవాళ్లు, ప్రేమించాలనుకునే వాళ్లందరూ ఈ సినిమాను తప్పకుండా ఇష్టపడతారు' అని నిర్మాత ఎస్‌కేఎన్ తెలిపారు. ఈ సినిమా కోసం తెలుగు నేర్చుకొని డబ్బింగ్ చెప్పానని హీరో మణికందన్ అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: శ్రేయాస్‌కృష్ణ, సంగీతం: సీన్ రోల్డన్, తెలుగు సంభాషణలు: మౌళి, తెలుగు రిలీజ్: మాస్ మూవీ మేకర్స్, మారుతి టీమ్ ప్రొడక్షన్, రచన-దర్శకత్వం: ప్రభురామ్ వ్యాస్.

అక్షయ్‌కుమార్ శివుడి పాట

'శంభు' అనే ఓ భక్తిరస సంగీత వీడియో సాంగ్ ఈ నెల 5వ తేదీ సోమవారం (నేడు) విడుదల కానున్నది. ఈ వీడియోలో హిందీ అగ్ర నటుడు అక్షయ్‌కుమార్ శివభక్తుడిగా నటించారు. భగవంతుడి పట్ల నిజమైన భక్తిని చాటుతూ శివుడి సేవకు అంకితమైన భక్తుడు రూపాంతరం చెందడాన్ని ప్రదర్శిస్తున్న ఓ పోస్టర్‌ను అక్షయ్‌కుమార్ సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. అయితే అదే పాటను అక్షయ్‌కుమార్ గానం చేశారని తాజా సమాచారం. సుధీర్ యదువంశీ, విక్రమ్ మంట్రోస్‌లతో కలిసి అక్షయ్‌కుమార్ శంభు ట్రాక్‌కి తన విలక్షణమైన టచ్‌ని జోడించి పాటను మరింత ఎత్తుకు తీసుకెళ్లారని మేకర్స్ చెప్తున్నారు. మహాశివరాత్రి వేడుక సందర్భాన్ని పురస్కరించుకొని శివుడికి అంకితం చేసిన గీతమే ఈ 'శంభు'. లోతైన భక్తిభావాన్ని ప్రేరేపితం చేస్తూ సంగీత ప్రియులను అలరిస్తుందని అంటున్నారు. అక్షయ్‌కుమార్ శివభక్తుడిగా కనిపిస్తుండటం ఇది రెండోసారి. గతంలో 'ఓ మైగాడ్-2' చిత్రంలో ఆయన శివభక్తుడిగా నటించారు.

హలో అమ్మాయి..

అభినవ్ గోమఠం కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'మస్ట్ షేడ్స్ ఉన్నాయ్ రా'. తిరుపతి రావు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని అరీమ్ రెడ్డి, ప్రశాంత్ వి, భవాని కాసుల నిర్మిస్తున్నారు. ఈ సినిమాలోని 'హలో అమ్మాయి..' అనే తొలి గీతాన్ని ఆదివారం విడుదల చేశారు. సంజీవ్ స్వరపరచిన ఈ పాటకు కిట్టు విస్సా ప్రగడ సాహిత్యాన్ని అందించారు. సిధ్ శ్రీరామ్ ఆలపించారు. అందమైన ప్రేమ భావాలకు అద్దం పడుతూ ఈ పాట సాగింది. నాయకానాయికల మధ్య కెమిస్ట్రీ ఆకట్టుకుంది. రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిస్తున్నామని, ఆద్యంతం చక్కటి వినోదంతో ప్రేక్షకుల్ని మెప్పిస్తుందని, ఈ నెల 23న చిత్రాన్ని విడుదల చేస్తున్నామని నిర్మాతలు తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: సిద్ధార్థ్ స్వయంభు, సంగీతం: సంజీవ్ టీ, సంభాషణలు: రాధామోహన్ గుంటి, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: తిరుపతి రావు.

అభినవ్ గోమఠం, వైశాలి

పెళ్లి చేసుకోవాలా?

తనదైన అందం, అభినయంతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నది బాలీవుడ్ భామ శ్రద్ధా కపూర్. రూపానికి తగ్గ దుస్తుల్లో కనిపిస్తూ కుర్రకారు మతిపోగొడుతుంటుంది. సామాజిక మాధ్యమాల్లో చురుగ్గా ఉండే ఈ అమ్మడు ఇటీవల తన పెళ్లి గురించి చేసిన పోస్ట్‌కు భారీగా స్పందిస్తున్నది ఆమె అభిమానగణం. 'నేను పెళ్లి చేసుకోవాలా?'.. అంటూ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో చేసిన పోస్ట్‌తో సోషల్ మీడియాలో సంచలనానికి తెర తీసింది. తొలుత సంప్రదాయ దుస్తుల్లో ఉన్న ఫొటోలను వరుసగా పోస్ట్ చేసిన ఈ ముద్దుగుమ్మ 'నేను ఎలా ఉన్నాను.. పెళ్లి చేసుకోవాలా?' అని అభిమానులను అడిగింది. దీంతో ఆమె ఇన్‌స్టా అకౌంట్‌ను కామెంట్ల వరద ముంచెత్తుతున్నది. అభిమానులే కాదు సంగీత దర్శకుడు దర్శన్ రావల్ కూడా ఈ పోస్ట్ కింద కామెంట్ చేయడం విశేషం. శ్రద్ధా కపూర్ చివరగా రణ్‌బీర్ కపూర్‌తో కలిసి 'తూ జూఠీ మైన్ మక్కార్'లో జత కట్టింది. తన తదుపరి చిత్రాలు 'నాగిన్', 'చల్‌బాజ్ ఇన్ లండన్'లో కనిపించనున్నది. ఆమె నటించిన 'స్త్రీ-2' కూడా ఆగస్టులో విడుదలకు సిద్ధంగా ఉన్నది.

శ్రద్ధాకపూర్

అయ్యోపాపం సారూ..

హాస్యనటుడు సుడిగాలి సుధీర్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'గోట్'. 'గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్స్' అనేది ఉప శీర్షిక. దివ్య భారతి హీరోయిన్. ఈ చిత్రానికి నరేశ్ కుప్పిలి దర్శకత్వం వహిస్తున్నారు. మహతేజ క్రియేషన్స్, జైష్ణవ్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తుండగా, చంద్రశేఖర్ మొగుళ్ల నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో కొన్ని కీలక సన్నివేశాలతో పాటు యాక్షన్ ఏపిసోడ్స్ చిత్రీకరిస్తున్నారు. ఈ సినిమా నుంచి ఓ లిరికల్ వీడియోను చిత్ర యూనిట్ ఆదివారం విడుదల చేసింది. 'అయ్యోపాపం సారూ'.. అంటూ సాగే ఈ పాటకు సాహిత్యం సురేశ్ బనిశెట్టి అందించగా, లియోన్ జేమ్స్ సంగీతం సమకూర్చారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.